అడ్డంగా తిరిగిన కథ...

# కాకీమూక

★ జి. వి. కృష్ణ ★

"గుంటూరు దగ్గరో ఏదో పల్లెలో, వాళ్ల బంధువుల్లో ఎవరికో పెళ్ళని, తనకు తీరుబడి లేనందుచేత, ఇంట్లోని వాళ్లందర్నీ మొన్ననే, మూడుగంటలబండిలో అక్కడికి పంపించివేసి, తను మాత్రం- నిన్నరాత్రి నడిచివెళ్ళిపోయాడు స్టేషన్ వైపు. 'ఇప్పుడెళ్లొద్దండీ, రేపు తెల్లారి వెళ్ళొచ్చు' అని నేనెంత మొత్తుకున్నా వినక—అంతే- తెల్లారి లేచేసరికి పిడుగులాటి ఈ వార్త చెవులో పడింది" అని కోటయ్య ఆకస్మిక మరణం తనకేమో మహా విచారం కల్గించినట్టుగా. కోటయ్య ఇంటిముందు అరుగుపై, అగ్రసనాధిపుని వలే నిలుచొని, చుట్టూమూగి ఉన్న గుంపుకేసి చూస్తూ, ఆవేళ ఉదయాన కేశవయ్య పల్కిన పల్కులివి.

"అజానుబాహువుడు" అని ఆగిపోయాడొక పెద్దమనిషి - ఆ గుంపులోనించి? తర్వాత ఏం మాట్టాడాలో ఊహకు తట్టక.

"సిల్కుతలపాగా, అదీ చుట్టుకొని, మోకాళ్ళవరకూ అ నల్లటికోటు ధరించి, ఈ వీధి వెంబడి కోటయ్యగారు నడిచి వస్తూంటే ఎలా ఉండేదనుకొన్నారూ... ప్చ్" తను చెప్పదలచిందంతా ఇంతే నన్నట్లుగా నిల్చిపోయాడొక బుర్ర మీసాల ఆసామి.

"ఎంతో పుణ్యం చేయబట్టి, సుఖమైన చావు చచ్చాడు" అది ఆ గుంపులోంచి నిష్క్రమిస్తూ అన్నాడు జనవయ్య, తోటి వర్తకుని మరణానికి తను చూపించదలచిన సంతాపం ఇదే నన్నట్లుగా. రైల్లోపడి చావటానికి మించిన సుఖమైన చావు ఇంకేదీ లేదని, పదిమంది చావు పెళ్లితో సమానమన్నట్లు. రైల్లో చావు కూడా ఇంక దేనితోనో సమానమని అతని అభిప్రాయం అయిఉండొచ్చు.

"హెట్లాటివారికి, హెట్లాటి సావు" అంటూ ఆ ఊరి పోస్ట్‌మేన్ మస్తానయ్య, ఆ మందలోకొచ్చి కలుస్తూ మూల్గాడు.

"ముచ్చటగా మూడో పెళ్ళిచేసుకొని వచ్చి-ఇంకా మూడునెలలైనా కాలేదు తీరా...పాపం!! ఈ సంగతి అ అమ్మాయికి తెలిసి ఎంతగా దుఃఖిస్తుందో... ప్చ్...ఇంత చిన్నవయస్సులోనే, ఆ అమ్మాయికి పసుపుకుంకుమలు దూరమైనాయ్" అని ఆ గుంపు చివరన కొద్ది దూరంలో నిలుచొని ఉన్న కేశవయ్య భార్య రత్తమ్మ, తనప్రక్కన గోడనానుకొని నిలుచున్న ఒక ముసలిబ్రాహ్మణ వితంతువుతో మెల్లిగా అనేసరికి- ఆమైన ఆ వితంతువు, కళ్ళల్లో నీళ్లు లేకపోయినా. కళ్లు పోయేటట్లు, మడిబట్టతో కళ్లు తుడుచుకొంటూ" మా ఆయన ఉండంగా...రత్తమ్మా!...నువ్వు నమ్మతావో లేదో కానీ, నా వొళ్ళంతా గోకితే చేతి నిండా ఇంత వచ్చేదమ్మా (బహుశః పసుపు కామోసు)...ఇంతకీ ఆయనుంటే మంగలెందుకు రత్తమ్మా" అని చనిపోయిన తన భర్తను ఓమారు జ్ఞప్తికి తెచ్చుకొని, ముక్కు తెగరవేసిందా వితంతువు.

"ప్చ్...సమయానికి దగ్గర ఎవరూ లేకపోయారే!!"అని ఆ గుంపులోంచి ఒక బొంగురుబోయిన కంఠం పల్కింది.

"ఈ సంగతి వాళ్ళవాళ్ళ కెవరికైనా తెలిసుంటుందంటావా?" అంటూ, ఆ గుంపును చీల్చుకొని ముందుకొచ్చి నిలబడి, అరుగుమీద నిలుచొనున్న కేశవయ్యతో హోటల్ సుబ్బమ్మ బుగ్గలు నొక్కుకుంటూ ప్రశ్నించింది.

"గుంటూరు దగ్గరే ఏదో పల్లెట... ఆ పల్లెపేరయినా తెలిసుంటె, తంతివ్వటమో, లేక ఎవరైనా అక్కడికి వెళ్లి రావటమో జరిగిఉండేది—ప్చ్!" అని నిట్టూర్చాడు కేశవయ్య.


"మీ ఇదిగానీ-నిన్నరాత్రి నెల్లూరి దగ్గర రైలుపడిపోవటమూ, అందులో కొందరు మరణించటమూ, ఈపాటికి వాళ్లవాళ్లకు తెలీకండా ఉంటుందా..." అని ఓ హైస్కూలువిద్యార్థి, గుంపులో ఓమూలనించి మెల్లిగా నసుక్కున్నాడు, తను ఇన్నేళ్లుగా చదివేడ్చిన విజ్ఞానాన్నంతా సద్వినియోగం చేసుకొంటున్నట్లుగా—

"ఇంతకీ - ఆ చనిపోయిన పద్దెనిమిది మందిలోనూ మన కోటయ్యగారుకూడా ఉన్నారని మీకెలా తెలుసు?" అన్నాడు, ఆ ఊరి ఆస్పత్రిలో రంగునీళ్లు కలిపి సీసాల్లో పోసి, తన ఉద్యోగ ధర్మాన్ని నెరవేర్చే, కంపౌండర్ మహాశయుడు.

గుంపుచివరన ఓ మూలనించి - అందుకొని 'ఎవరు చూశారు నాయనా!... అందుకే వాన రాకడా ప్రాణ పోకడా తెలీదన్నారు పెద్దలు. నిన్నరాత్రి వానొస్తుందని ఎవ్వరనుకొన్నారూ - వానవల్ల పట్టాలు చెదిరిపోయినందుచేత, పట్టాలు తప్పి ఆ పాడు రైలు కాస్తా అలా నెల్లూరిదగ్గర పడిపోతుందని ఎవరనుకొన్నారూ!—' అంతా ఆ మీది రాముడి లీల!!అని ఆ ఊరి హైస్కూల్ తెలుగు పండితుడు గొణుక్కున్నాడు—

'స్వామీ! ఆ శఠగోపం బాగా తలలో దూరేటట్లు పెట్టండీ—' అని ఆ పుణ్యాత్ముడు, ప్రతిదినమూ సాయంత్రము దేవస్థానానికి వచ్చినప్పుడల్లా అనే మాటలు ఇప్పటికీ నా చెవికి ఆయన అంటున్నట్లుగానే ఉంది—ఛుక్! ఛుక్!! ఛుక్!!!' అని, ముక్కునించి తీసిన నశ్యం పలుకులను, మాత్రల్లాగా చేతిలో నలుపుతూ అన్నాడు ఆ ఊరి ఆంజనేయస్వామి దేవాలయపు పూజారి శ్రీమాన్ దేసికాచారి.

కోటయ్య ఇంటివసారాముందు పై మెట్లపై నెపోలియన్‌లా చేతులు వెనక్కు కట్టుకొని, ఈ వైపునించి ఆ వైపుకూ, ఆ వైపునించి ఈ వైపుకూ, పచార్లు చేస్తూన్న కేశవయ్య అమాంతంగా ఆగిపోయి, చుట్టూఉన్న గుంపును ఓమారు తిలకించి, అవలిస్తూ 'కోటయ్యగారివద్ద- ఎన్నడో నేను యాభై రూపాయలు అప్పుగా పుచ్చుకొన్నాను. ఆ బాకీని చెల్లించటానికి ఆయనవద్దకు వచ్చినపుడల్లా 'ఇప్పుడేం



ఈస్టిండియావారి 'సంక్రాంతి'లో సావిత్రి.

ముంచుకొనిపోయింది కేశవయ్యా తర్వాత ఎప్పుడన్నా ఇవ్వొచ్చులే' అని ఇంతవరకూ తప్పించుకొంటూ వచ్చినాడా మహానుభావుడు ఆయన బుణాన్ని ఏ విధంగా తీర్చుకోగలనో ., అని వాక్యం ముగించేలోగా, ఉన్నట్లుండి నల్లకోటూ తలపాగాతో అమాంతంగా ఆ గుంపు నంతా చీల్చుకొని మెట్లవరకూ వచ్చి ఆగిపోయి, తిన్నెమీద తెల్లబోయి చూస్తూన్న తనయింటివైపూ, తన ఇంటి ముందు మూగి తనవైపు ఆశ్చర్యంగా చూస్తూఉన్న జనం వైపూ నివ్వెవపోయి చూస్తూ 'ఏంటీ? ఏంజరిగింది? ఎందు కిలా ఇంటిచుట్టూ ఇంతమంది మూగా రూ? ఎవ్వరూ పల్కరేం?' అని గర్జించి, కోటయ్యవైపు చురచురా చూస్తూ నిల్చిపోయ్యాడు

దయ్యమై వచ్చాడో-ఏం పాడో - పాదాలూ, మోచేతులైనా గమనించ (డా' అని గుంపుచివరినించి కేశవయ్య భార్య ఎలుగెత్తి అరిచింది ఆమె అనిన మాటలకు అర్థంకాక కోటయ్య తన మోచేతుల్నీ, పాదాల్నీ ఓమారు సాందించూసుకొని తెల్లబోయాడు

తిన్నెమీద ఇంకా అలాగే స్తబ్దుడై నిలుచొనున్న కేశవయ్య 'నిన్నరాత్రి నెల్లూరిదగ్గర రైలు పడిపోయింది కదండీ' అని తడబడుతూ అన్నాడు

'ఊఁ.. ఐతే?' మళ్లీ గర్జించాడు కోటయ్య,

'మీరుకూడా ' అని కేశవయ్య ముగించేంతలోగా, కోటయ్య 'నేను ఊరి కెళ్ళానని నీ కెవరు చెప్పారయ్యా' అని కేశవయ్య వైపు గుడ్లెర్రజేస్తూ అనేసి, తర్వాత ఆ గుంపువైపు తిరిగి 'నేను నిన్న రాత్రి స్టేషన్ దగ్గరకెళ్ళేసరికి బండి కాస్తా వెళ్లిపోయింది-ఆ వానలో ఇంటికి రాలేక, తూర్పువీధిలోనే ఒకరింట పడుకొని, ఇప్పుడిక్కడికి వస్తున్నారు' అని అనేవరకూ, అక్కడ మూగిన గుంపుకు అప్పటికి కానీ తెలిసింగి కాదు, కోటయ్య, తన ఉంపుడుకత్తె ఇంట్లో నిన్న రాత్రి గడిపి వచ్చాడని

కోటయ్య మళ్లీ కేశవయ్యకేసి తీక్ష ణంగా చూస్తూ 'నేను ఊరెళ్లిన సంగతి నీకెలా తెలుసయ్యా? ఆరునెలలుగా నా దగ్గర యాభై రూపాయలు అప్పుగా పుచ్చుకొని పోయినప్పట్నించీ, నీ మొహం నాకు చూపించకుండా తప్పించుకొని తిరుగుతున్నవాడివి, నేను రైల్లో పడి చచ్చాననుకొని తంటా తీరిందనుకొన్నావా ఏమిటయ్యా?' అని కోపంతో మెట్లెక్కి విధితలుపుదగ్గర కెళ్లి తాళం తీస్తూ అనేసరికి, ఆ ప్రజలంతా- ఇందాక కేశవయ్య పల్కిన బొల్లిమాటలకు తమలో తాము ఓ మారు నవ్వుకొన్నారు.

కోటయ్య అటు తిరిగిఉండటంచూసి, కేశవయ్య మెల్లిగా ఆ తిన్నెమీదనించి కిందికి లంఘించి మెల్లిగా ఆ గుంపులో కలిసిపోయ్యాడు

'ఇప్పుడొచ్చిందో ఏమో మీకు నాపై విశ్వాసం మొన్న ఓట్లప్పుడు ఎక్కడ పోయి ఉండింది మీ ఇదంతా? ఇక్కడ మూగిఉన్న జనంలో సగంమందైనా- నా కే ఇచ్చిఉంటే-నా డిపాసిట్ డబ్బులైనా మిగిలిఉండేవి' అని గర్జిస్తూ, దభాలున వీధి తలుపులు తెరిచేసి కోటయ్య ఇంట్లో అడుగుపెట్టేసరికి అక్కడ మూగిఉండిన కాకిమూకంతా మెల్లిమెల్లిగా కరిగిపోయింది కొంతసేపటికి' కోటయ్య ఇంటివీధి వసారా చిన్నబోయింది.